క్లుప్తంగా

ఆర్యవైశ్య సంఘ నూతన కార్యవర్గం ఎన్నిక

దేవరపల్లి: మండలంలోని దుద్దుకూరు ఆర్యవైశ్య సంఘం నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. బుధవారం రాత్రి గ్రామంలోని ఏబీసీ ఫంక్షన్ హాల్లో జరిగిన గ్రామ ఆర్యవైశ్య సంఘం సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కొండ ప్రసాద్, ఉపాధ్యక్షుడిగా వెలగా నాగేశ్వరరావు, కార్యదర్శిగా వెలగా నాగు, కోశాధికారిగా ఆచంట మూర్తి, సభ్యులుగా పెనుగొండ భద్రం, నాలం శ్రీను, మొత్కూరు భాస్కరరావు ఎన్నికయ్యారు. ఈ సమావేశంలో దేవరపల్లి ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు కొత్తగుండ రామారావు, తీగల రమేష్, తీగల సురేష్, వెలగా శ్రీనివాస్ తదితరులు పాల్గొని నూతన కార్యవర్గాన్ని అభినందించారు.

వృద్ధులకు అల్పాహారం అందజేత

చాగల్లు: మల్లవరంలో వృద్ధాశ్రమంలో వృద్ధులకు మద్దూరుకు చెందిన మాస్టర్ కె.పార్వతీకుమార్ సేవాసమితి ఆధ్వర్యంలో గురువారం వృద్ధులకు అల్పాహారం అందజేశారు. పార్వతీకుమార్ జయంతి సందర్భంగా వృద్ధులకు బిస్కెట్లు, అల్పాహారం పంపిణీ చేసినట్టు సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు నిమ్మల రామారావు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ఉండ్రాజవరం: వార్షిక పనుల నిమిత్తం పాలంగి సబ్‌స్టేషన్ పరిధిలో పాలంగి, చివటం, కె.సావరం గ్రామాలకు శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు నిడదవోలు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్.నారాయణ అప్పారావు గురువారం తెలిపారు. వ్యవసాయ, పరిశ్రమలకు ఉదయం 4 గంటల నుంచి 8 గంటల వరకు, మధ్యాహ్నం ఒంటి గంట నుంచి ఆరు గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుందని తెలిపారు.

నిడదవోలు రూరల్: మండలంలోని పురుషోత్తపల్లి, కాటకోటేశ్వరం సబ్‌స్టేషన్ల పరిధిలోని విజ్జేశ్వరం, పురుషోత్తపల్లి, డి.ముప్పవరం, పందలపర్రు, ఉనకరమిల్లి, తాడిమళ్ల గ్రామాల్లో శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నారు.

నిడదవోలు: నిడదవోలు మున్సిపాలిటీ పరిధిలోని రామ్‌నగర్, గణేష్ చౌక్, ఓవర్ బ్రిడ్జి డౌన్, పోలీస్ స్టేషన్, గాంధీ బొమ్మ సెంటర్, రైల్వే గేట్, బసివిరెడ్డిరెడ్డిపేట, అన్నపూర్ణనగర్ ఏరియాలలో వాణిజ్య, గృహ వినియోగదారులకు విద్యుత్ నిలిపివేస్తున్నట్టు ఆయన తెలిపారు.

కొవ్వూరు: పశివేదల 33/11కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ వార్షిక మరమ్మతుల కారణంగా దేచెర్ల సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నారు. దేచెర్ల సబ్ స్టేషన్ పరిధిలోకాపవరం, ధర్మవరం, దేచెర్ల లోకల్ 11కేవీ ఫీడర్లతో పాటు ఐ.పంగిడి వాటర్ వర్క్స్‌కి కూడా విద్యుత్ జీ నిలిపివేయనున్నట్టు తెలిపారు.

దేవరపల్లి: దేవరపల్లిలోని 33/11 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో నూతన ఫీడర్ పనులు జరుగుతున్నందున శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుంది. దేవరపల్లి, అచ్చయపాలెం, బందపురం, గొల్లగూడెం, ఇండస్ట్రియల్, యర్నగూడెం, సూర్యానారాయణపురం, త్యాజంపూడి 11 కేవీ ఫీడర్ల పరిధిలో గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఏపీఈపీడీసీఎల్ ఈఈ ఎస్.నారాయణ అప్పారావు తెలిపారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటు నమోదుకు గడువు పెంపు

దేవరపల్లి: గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటు నమోదు చేసుకోవడానికి ఈ నెల 20వ తేదీ వరకూ గడువు పొడిగించినట్టు దేవరపల్లి తహసీల్దార్ కె.రాజ్యలక్ష్మి తెలిపారు. గతంలో ఇచ్చిన గడువు బుధవారం సాయంత్రం ముగిసినప్పటికీ ఈ గడువును 20 వరకూ పెంచినట్టు ఆమె తెలిపారు. 25 వరకు దరఖాస్తుల పరిశీలన, 30న ఓటర్ల తుది జాబితా విడుదల అవుతుందన్నారు. బుధవారం సాయంత్రం వరకూ మండలంలో 1554 ఓట్లు ఆన్‌లైన్‌లోను, 750 ఓట్లు ఆఫ్‌లైన్‌లో నమోదైనట్టు ఆమె తెలిపారు.

చిన్నారుల భవితకు అండగా..

- ప్రత్యేక అవసరాల గల పిల్లల కోసం భవిత కేంద్రాలు
- ఉచిత శిక్షణ, పరికరాల అందజేత
- చిన్నారుల్లో మనోధైర్యం నింపుతున్న ఐఈఆర్పీలు

నల్లజర్ల: మానసికంగా శారీరకంగా ఇబ్బంది పడుతున్న చిన్నారులకు వారి తల్లులకు మేమున్నామంటూ మనోధైర్యాన్ని నింపుతున్నారు భవిత కేంద్రంలో పని చేసే ఐఈఆర్పీలు. ప్రత్యేక అవసరాలున్న పిల్లల కోసం ప్రభుత్వం మండలానికి ఒక భవిత కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. ఈ కేంద్రాల్లో ఇద్దరు చొప్పున ఐఈఆర్పీలు పనిచేస్తున్నారు. వీరు చిన్నారులకు శిక్షణ ఇస్తున్నారు. తల్లిదండ్రులకు ఇతోధిక సహాయ సహకారాలు అందిస్తున్నారు. ఐఈఆర్పీ(ఇంటిగ్రేటెడ్ ఎడ్యూకేషన్ రీసోర్స్ పర్సన్స్)ల ద్వారా సర్వేలు నిర్వహించి ప్రత్యేక అవసరాలు గల పిల్లలను గుర్తించి వారికి చక్కటి భవిష్యత్తు కోసం ప్రభుత్వం కృషి చేస్తోంది.

విద్యాబుద్ధులు నేర్పిస్తూ..

మండల కేంద్రమైన నల్లజర్లలో నంబరు-2 ప్రాథమిక పాఠశాలలో ఈ భవిత కేంద్రం ఉంది. ఈ కేంద్రం ద్వారా అన్ని గ్రామాల నుంచి 90 మంది ప్రత్యేక అవసరాలు గల పిల్లలను గుర్తించి వారికి శిక్షణ ఇస్తున్నారు. భవిత కేంద్రాలకు వచ్చే పిల్లలకు సమగ్ర శిక్ష ద్వారా విద్యార్థి దశలోనే మానసిక దివ్యాంగులకు విద్యాబుద్ధులు నేర్పించడం, ఫిజియోథెరపీ చేయించడం, వారికి అవసరమైన పరికరాలు అందించడంతో పాటు వారి పనులు వారే స్వయంగా చేసుకునేలా తీర్చిదిద్దుతున్నారు. గుర్తించిన పిల్లల వయస్సులతో పాటు వారి పరిస్థితిని అంచనా వేసి ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పిస్తున్నారు. అలా కాకుండా తగిన తర్ఫీదు, వివిధ సేవలు అవసరమున్న వారిని ముందుగా భవిత కేంద్రంలో చేర్చుకుంటారు. వీరికి స్పీచ్‌థెరపీ, ఫిజియోథెరపీ, చిన్నతనంలోనే వికలాంగత్వాన్ని గుర్తించి తగిన కృత్యాలను, రోజు వారీ కార్యక్రమాలను పిల్లలకు నేర్పిస్తారు. ఇలా వారంలో ఐదు రోజుల పాటు సేవలందించిన ఐఈఆర్పీలు పిల్లల ఇంటి వద్దకు వెళ్లి తల్లిదండ్రుల సమక్షంలో ఫిజియోథెరపీతో పాటు శిక్షణ ఇస్తారు.


భవిత కేంద్రంలో ఫిజియోథెరపీ చేస్తున్న డాక్టర్ రాజేష్‌రెడ్డి

చైల్డ్ అలవెన్స్‌లు అందజేస్తూ..

ప్రత్యేక అవసరాల పిల్లలకు మూడు రకాల అలవెన్స్‌లు ప్రభుత్వం అందిస్తోంది. బడికి వచ్చే మానసిక, బుద్ధి మాంద్యం ఉన్నవారికి ఇంటి వద్దే ఉన్న వారికి, ఆడపి ల్లలకు ప్రత్యేక గరల్స్‌చైల్డ్ అలవెన్స్ పేరిట నెలకు, రూ.300 వంతున పది నెలలకు రూ.3 వేలను వారి తల్లుల ఖాతాలో ఏడాదికి ఒకే సారి జమచేస్తోంది. పిల్లలకు అవసరమైన సామగ్రి అందించడంతో పాటు బడికి వచ్చే పిల్లలకు యూనిఫాం, పుస్తకాలు, టై, బెల్ట్ అందిస్తూ అమ్మ ఒడి పథకం కూడా అందిస్తున్నారు.


బాలునికి ఇంటి వద్ద సేవలు అందిస్తున్న ఐఈఆర్పీ రజిత

పిల్లలకు శిక్షణ



భవిత పాఠశాలలో ఐఈఆర్పీగా పనిచేయడం పిల్లలకు చేస్తున్న సేవ ఒక భాగ్యంగా భావిస్తున్నా. మాటలు రాని పిల్లలకు మాట్లేడేందుకు, వారి పనులు వారే చేసుకునేలా శిక్షణ ఇస్తున్నాం. పిల్లలకు మేం ఇస్తున్న శిక్షణను తల్లిదండ్రులు సైతం ఇంటి వద్ద కొనసాగించాలి. అపుడే పిల్లలు త్వరితగతిన మెరుగవుతారు. ఇందుకు తల్లిదండ్రులు తరచూ భవిత పాఠశాలకు వచ్చి తాము ఇచ్చే సలహాలు, సూచనలు స్వీకరించాలి.

– రజిత, ఐఈఆర్పీ, నల్లజర్ల

ముందుగా సమస్య గుర్తిస్తే..



భవిత కేంద్రం ద్వారా ఎక్కువ మంది ప్రయోజనం పొందుతున్నారు. వారు వైద్య, రవాణా ఖర్చులు భరించాల్సిన అవసరం లేదు. మేము నేర్పిన అంశాలు, శిక్షణను తల్లిదండ్రులు క్రమం తప్పకుండా ఇంటి వద్ద చేయించాలి. అప్పుడే ప్రయోజనం ఉంటుంది. సమస్య ఉన్న పిల్లలను తొందరగా గుర్తించి శిక్షణ ప్రారంభిస్తే మంచిది.

– రేణుక సాయి, ఐఈఆర్పీ, నల్లజర్ల

మృతుల కుటుంబాలకు నష్టపరిహారం ఇవ్వాలి


తాడిపర్రులో మృతుల కుటుంబాలను పరామర్శిస్తున్న విశ్వేశ్వరరెడ్డి

ఉండ్రాజవరం: తాడిపర్రు గ్రామంలో విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందిన వారి కుటుంబాలకు నష్ట పరిహారం కింద ఒక్కొక్కరికి రూ.25 లక్షలు ఇవ్వాలని, కుటుంబంలో ఒకరికి ఉపాధి కల్పించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ టీకే.విశ్వేశ్వరరెడ్డి డిమాండ్ చేశారు. మండలంలో తాడిపర్రు గ్రామంలో కాంగ్రెస్ నేతలతో కలసి ఆయన మృతులు బోళ్లా వీర్రాజు, మారిశెట్టి మణికంఠ, పామర్తి నాగేంద్ర, కాసగాని కృష్ణల కుటుంబ సభ్యులను గురువారం పరామర్శించారు. గత ప్రభుత్వంలో ఎవరైనా ప్రమాదవశాత్తు మరణిస్తే అప్పుడు ప్రతిపక్షంలో ఉన్న చంద్రబాబు నాయుడు కుటుంబానికి రూ.50 లక్షలు లేదా కోటి రూపాయలు పరిహారం ఇవ్వాలని చెప్పేవారన్నారు. అంటువంటిది ఇప్పుడు విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందిన కుటుంబ సభ్యులకు ఐదు లక్షల పరిహారం ఇచ్చి చేతులు దులుపుకోవడం ఏంటని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ కమిటి ఉపాధ్యాక్షుడుమార్టిన్ లూథర్, మండల కమిటీ అధ్యక్షుడు కరుటూరి రామకృష్ణ వరప్రసాద్, రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ కార్యదర్శి చిన్నం మురళికృష్ణ, పట్టణ కాంగ్రెస్ కమిటి అధ్యక్షులు మేడవరపు భద్రం దొర, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.అరుణకుమారి, పెరవలి మండల అధ్యక్షుడు బుద్దాల లక్ష్మణరావు, మైనారిటీ అధ్యక్షులు షేక్ హుస్సేన్ జాహ తదితరులు పాల్గొన్నారు.

రజకులకు వృత్తి చెరువులు కేటాయించాలి

డివిజనల్ పంచాయతీ అధికారికి వినతిపత్రం

నల్లజర్ల: రజకులకు వృత్తి చెరువులు కేటాయించాలని, చెరువులకు లీజులు నిర్ధారించాలని కోరుతూ గురువారం కొవ్వూరు డివిజన్ పంచాయతీ అధికారికి అమ్మాజీకి వినతిపత్రం సమర్పించినట్టు నల్లజర్లలో గురువారం జిల్లా రజక సంఘ అధ్యక్షుడు చిలకలపల్లి కట్లయ్య విలేకర్లకు తెలిపారు. రజకులు వృత్తి చేసుకుంటున్న దేవరపల్లి మండలం లక్ష్మీపురం, దేవరపల్లి గ్రామాల్లో రజకుల చెరువు సమస్యలను పరిష్కరించాలన్నారు. గోపాలపురం మండలం హుకుంపేట, నల్లజర్ల మండలంలో కవులూరు గ్రామంలో చెరువుల విషయంలో రజకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ప్రభుత్వం జారీ చేసిన జీఓ ప్రకారం రజకులకు కేటాయించిన వృత్తి చెరువులపై హక్కులు కల్పించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. డీఎల్‌పీఓ అమ్మాజీ మాట్లాడుతూ రజకుల వృత్తి చెరువుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. రజకులకు కేటాయించిన చెరువులు వేరే వారికి లీజుకు ఇచ్చినా, లీజు దుర్వినియోగం చేసినా నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. కట్లయ్యతో పాటు జిల్లా ఉపాధ్యక్షురాలు మెట్టా లక్ష్మీప్రసన్న, కాడెల్లి సుబ్బారావు, విఠల్ శ్రీనివాస్, వట్లూరి మురళీ, కోటిచుక్కల నాగేశ్వరావు ఉన్నారు.


కొవ్వూరు డివిజన్ పంచాయతీ అధికారి అమ్మాజీకి వినతిపత్రం అందిస్తున్న కట్లయ్య

గిట్టుబాటు లేక దొండ రైతుల విలవిల

- 10 కిలోల దొండకాయలు రూ.100 మాత్రమే..

పెరవలి: ముందు నుయ్యి వెనుక గొయ్యి అన్న చందాన ఉంది దొండ రైతుల పరిస్థితి. నిన్న మొన్నటి వరకు దిగుబడి లేక విలవిల లాడిన రైతులు తీరా దిగుబడి వచ్చే సమయంలో గిట్టుబాటు ధర లేక అల్లాడిపోతున్నారు. ఖండవల్లి కూరగాయల మార్కెట్టులో 10 కిలోల దొండకాయలు రూ.100 పలకడంతో రైతులు కోత ఖర్చులు కూడా రాలేదని లబోదిబోమంటున్నారు. దొండకాయలు కోత కోసే మహిళా కూలీలకు రోజుకి రూ.400 ఇస్తుండగా ఎకరానికి 10 మంది కూలీలతో కోత కోయిస్తున్నామని, దీనికి కూలీ మొత్తం రూ.4 వేలు అవుతుందని తెలిపారు. వీరు కోసే దొండకాయలు 10 బస్తాలు వస్తాయని వీటికి మార్కెట్టులో రూ.8 వేల వరకు వస్తుందని కూలీ ఖర్చులు పోను మిగిలిన దాంట్లో ఆటో కిరాయి, సంచులు, కూలీలకు కాఫీ, టిఫెన్‌లు మరో రూ.1000 అవుతున్నదని చెబుతున్నారు. మిగిలిన సొమ్ములతో ఎరువులు, పురుగు మందులకు అవుతున్నాయని దీంతో దిగుబడి పెరిగిందని ఆనందించాలో లేక గిట్టుబాటు ధర లభించలేదని బాధపడాలో తెలియన పరిస్థితిలో ఉన్నామని దొండ రైతులు పులపర్తి అచ్చన్న, పంత రాంబాబు తెలిపారు. దొండసాగు చేయాలంటే ఎకరానికి పెట్టుబడి రూ.80 వేలు అవుతుందని మార్కెట్టులో గిట్టుబాటు ధర ఉండి దిగుబడి బాగుంటే ఏడాదిలో ఖర్చులు అన్ని పోను పెట్టుబడి తీస్తామని, లేకపోతే నష్టపోవలసి వస్తుందని తెలిపారు. ఈ సాగు ఒక్కసారి చేపడితే రెండేళ్ల యథేచ్ఛగా ఫలసాయం పొందవచ్చని తెలిపారు.


ఖండవల్లి కూరగాయల మార్కెట్‌లో ఎగుమతి అవుతున్న దొండకాయ బస్తాలు

రాష్ట్ర స్థాయి పోటీలకు చాగల్లు, కలవలపల్లి విద్యార్థులు


చాగల్లులో విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు


కలవలపల్లిలో విద్యార్థిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

చాగల్లు: కలవలపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి అండర్-14 బాలురు విభాగంలో రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికై నట్టు పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు ముత్యాల వి.వి.ఎస్.లక్ష్మీనారాయణ తెలిపారు. ఇటీవల జరిగిన స్కూల్ గేమ్స్ ఎంపికలో ఎనిమిదో తరగతి విద్యార్థి మట్టా కిరణ్‌కుమార్ అండర్-14 బాలురు విభాగంలో నవంబర్ 9వ తేదీ నుంచి 11వ తేదీ వరకూ బాపట్లలో జరిగే రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొంటాడని ఆయన తెలిపారు. కోచ్ కొయ్య గంగాధరరావు, విద్యార్థిని ఉపాధ్యాయులు అభినందించారు.

చాగల్లు విద్యార్థులు

ఇటీవల జరిగిన జిల్లా స్థాయి క్రికెట్ పోటీల్లో చాగల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు పాల్గొని విజయం సాధించారని పాఠశాల హెచ్‌ఎం పి.వీర్రాజు తెలిపారు. అండర్-17, 19 విభాగాల్లో రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలకు విద్యార్థులు గీత, ఎం.తేజశ్రీ, వినయ విధేయలు ఎంపికయ్యారని తెలిపారు. వీరికి కోచ్ ఇచ్చిన వ్యాయమ ఉపాధ్యాయులు ప్రేమ చందును ఉపాధ్యాయ సిబ్బంది, పీడీ విజయలక్ష్మి అభినందించారు.

అక్రమార్కులకు అండగా కూటమి నేతలు

ఆవగట్టుపై చెట్లు నరికిన ఘటనలో కేసు నమోదు చేయని పోలీసులు


తాడిమళ్ల ఆవగట్టుపై నరికివేసిన చెట్లు(ఫైల్)

నిడదవోలు రూరల్: తాడిమళ్ల ఆవగట్టుపై ఉన్న చెట్లు అక్రమంగా నరికేసిన అక్రమార్కులకు కూటమి నాయకులు అండగా నిలిచారు. ఆవగట్టుపై ఉన్న వివిధ రకాల పెద్ద పెద్ద చెట్లను గ్రామానికి చెందిన జనసేన నాయకుడు, ఆ గ్రామ ప్రజాప్రతినిధి భర్త కలిసి నరికివేయించి చిక్కాలకు చెందిన కట్టెల వ్యాపారికి రూ.లక్షకు విక్రయించారు. ఈ విషయాన్ని గుర్తించిన తాడిమళ్ల గ్రామానికి చెందిన మరి కొంత మంది జనసేన కార్యకర్తలు ఎర్రకాలువ డీఈ రవీంద్రబాబుకు బుధవారం ఫిర్యాదు చేయడంతో వెంటనే ఆయన ఆ ప్రదేశాన్ని పరిశీలించి పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. అయితే చెట్లు నరికిన వారిపై పోలీసులు ఎటువంటి కేసులు నమోదు చేయకపోవడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇరిగేషన్ అధికారులతో పాటు ఈ విషయాన్ని వెలుగులోకి తీసుకువచ్చిన జనసేన కార్యకర్తల మధ్య రాజీ చేసి చెట్లు నరికించిన ఇద్దరి వ్యక్తులపై పోలీసులు కేసు నమోదు చేయకుండా కూటమి నేతలు అడ్డుకున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

అంగన్‌వాడీ కేంద్రాల్లో కిచెన్ గార్డెన్లు ఏర్పాటు చేయాలి

ఉపాధిహామీ, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలకు అవగాహన కార్యక్రమం

నల్లజర్ల: ప్రతి అంగన్‌వాడీ కేంద్ర పరిధిలో 10 సెంట్ల విస్తీర్ణంలో కిచెన్ గార్డెన్లు ఏర్పాటు చేయాలని ఐసీడీఎస్ ఏసీడీపీఓ పద్మావతి సూచించారు. నల్లజర్ల ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాలయంలో గురువారం ఉపాధి హామీ సిబ్బంది, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రసాయన ఎరువులు వినియోగించకుండా ప్రకృతి సిద్ధంగా గోంగూర, తోటకూర, కొత్తిమీర ఆకుకూరలు, వంగ, బెండ, టమాట వంటి కూరగాయలు, నిమ్మ, దానిమ్మ, బొప్పాయి వంటి పండ్లు పండించాలన్నారు. స్థలానికి చుట్టూ ఫెన్సింగ్ వేయాలన్నారు. వ్యవసాయ, ఉద్యాన శాఖల ద్వారా విత్తనాలు సమకూర్చుకోవాలన్నారు. నీటి సౌకర్యం తప్పనిసరిగా ఉండాలన్నారు. 8వ తేదీ నుంచే పనులు ప్రారంభంకావాలన్నారు. ప్రకృతి వ్యవసాయ విభాగం ఎం.టీ శ్రీనివాస్, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ శ్రీనివాస్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఐసీడీఎస్ ఏసీడీపీఓ పద్మావతి

పొగాకు పంట మార్పిడిపై రైతులకు నేడు శిక్షణ

దేవరపల్లి: రబీ సీజన్‌లో పంట మార్పిడిపై గోపాలపురం నియోజకవర్గంలోని దేవరపల్లి, గోపాలపురం, నల్లజర్ల మండలాల్లోని రైతులకు శుక్రవారం ఉదయం 9.30 గంటలకు దేవరపల్లిలోని పొగాకు వేలం కేంద్రం వద్ద శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు గోపాలపురం జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రబీ యాజమాన్యం, పొగాకు పంట మార్పిడి విధానాలపై రైతులకు అవగాహన కల్పించనున్నట్టు తెలిపారు. ప్రతి గ్రామం నుంచి రైతులు తప్పనిసరిగా శిక్షణా కార్యక్రమానికి హాజరుకావాలని ఆయన కోరారు. శిక్షణ కార్యక్రమానికి హాజరవుతున్న రైతులకు, వ్యవసాయ, ఉద్యాన శాఖ, పొగాకు బోర్డు అధికారులు, సిబ్బందికి మధ్యాహ్న భోజన ఏర్పాటు చేసినట్టు ఆయన తెలిపారు. హాజరవుతున్న రైతుల వివరాలను ముందుగా తెలియజేయాలన్నారు. ఈ శిక్షణ కార్యక్రమంలో జిల్లా ఉద్యాన శాఖ అధికారి సుజాత కుమారి, పొగాకు బోర్డు రీజనల్ మేనేజరు జీఎల్‌కే ప్రసాద్, జిల్లా ఏపీఎంఐపీ పీడీ, శాస్త్రవేత్తలు, డీఆర్సీ అధికారులు, దేవరపల్లి, గోపాలపురం పొగాకు వేలం కేంద్రాల అధికారులు, సిబ్బంది హాజరవుతున్నట్టు ఎస్.మాధవరావు తెలిపారు.

క్యాన్సర్ నివారణపై అవగాహన ర్యాలీ


నిడదవోలు పట్టణంలో ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది


క్యాన్సర్‌పై పెద్దాపురం ఎంపీయూపీ పాఠశాలలో అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారులు ఉపాధ్యాయులు


ఉండ్రాజవరంలో క్యాన్సర్‌పై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న పీహెచ్‌సీ సిబ్బంది, విద్యార్థులు

నల్లజర్ల: అవగాహనతోనే క్యాన్సర్‌ను జయించగలమని ప్రాథమిక ఆరోగ్య కేంద్ర డాక్టరు తెల్లం గంగాధరరావు అన్నారు. జాతీయ క్యాన్సర్ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలో గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శరీరంలో అనూహ్యంగా కనిపించే మార్పులతో వ్యాధిని నిర్ధారించి నివారించవచ్చునన్నారు. మారిన ఆహారపు అలవాట్లే ముప్పునకు ప్రధాన కారణమన్నారు. బాగా శుద్ధి చేసిన ప్యాకేజ్డ్ ఫుడ్, కూల్‌డ్రింక్స్, పొగాకు, మద్యం, అధిక కొవ్వుండే ఆహార పదార్థాలను తీసుకోవడంతో అవయవాల పనితీరు దెబ్బతింటుందన్నారు. శ్రమలేని జీవనశైలీ కూడా ఒక కారణమన్నారు. మంచి ఆహార అలవాట్లు, వ్యాయామం, యోగా వంటివి పాటించాలన్నారు. క్యాన్సర్‌ను ప్రాథమిక దశలో గుర్తిస్తే చాలా వరకు వ్యాధి నయమవుతుందన్నారు. అవగాహన లోపంతో బాధితుల సంఖ్య పెరుగుతోందన్నారు. మరో డాక్టరు సిరాజుద్దీన్, సీహెచ్‌ఓ ప్రసాద్, వైద్యుద్యోగుల సంఘ నాయకులు జీవీవీ ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

ఉండ్రాజవరం : ముందస్తు పరీక్షతో క్యాన్సర్ నుంచి రక్షణ నిస్తుందని ఉండ్రాజవరం హెచ్‌సీ డాక్టర్ ఆర్ఎస్ఎస్‌వీ ప్రసాద్ అన్నారు. ముందస్తు క్యాన్సర్ స్క్రీనింగ్‌లో భాగంగా ఉండ్రాజవరం గ్రామంలో నంబర్-1 పాఠశాల విద్యార్థులతో కలసి పీహెచ్‌సీ సిబ్బంది గురువారం క్యాన్సర్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ ముందస్తు క్యాన్సర్ స్క్రీనింగ్ వల్ల ఎవరికైనా క్యాన్సర్ లక్షణాలతో బాధపడుతున్నట్టు అయితే, ఈస్క్రీనింగ్ వల్ల అటువంటి వారిని గుర్తించి తగిన పరీక్షలు నిర్వహించి వారికి మందులు అందించి క్యాన్సర్ నుంచి కాపాడడానికి అవకాశం ఉంటుందన్నారు. డాక్టర్ ఆర్.ఉషాదేవి మాట్లాడుతూ ఈకార్యక్రమం ఈనెల 14వ తేదీ నుంచి మండలంలో ఉన్న అన్ని స్కూల్స్‌లో విద్యార్థులకు క్యాన్సర్ స్క్రీనింగ్ చేసినట్టు తెలిపారు. సీహెచ్‌వో ఎం.సుబ్రహ్మణ్యం, పబ్లిక్ హెల్త్ నర్స్ కె.కుమారి, ఆరోగ్య పర్యవేక్షకులు జీన్నూరి శ్రీను, కె.నాగమణి, ఆరోగ్య, ఆషా సిబ్బంది పాల్గొన్నారు.

గోపాలపురం: క్యాన్సర్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని పొగాకు మద్యం మత్తు పదార్థాల జోలికి వెళ్లకుండా ఉండాలని కమ్యూనిటీ హెల్త్ అధికారి బంటు సౌజన్య అన్నారు. మండలంలోని పెద్దాపురం ఎంపీయూపీ పాఠశాలలో గురువారం జాతీయ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా ర్యాలీ అవగాహన సదస్సు నిర్వహించారు. హెచ్‌ఎం కె.పోశియ్య, ఏఎన్‌ఎం బుక్కా జ్యోతి, సీఆర్పీ కె.గరాజు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నిడదవోలు: జాతీయ క్యాన్సర్ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలో కమ్యూనిటీ పారామెడిక్స్, ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నిడదవోలు శాఖ ఆధ్వర్యంలో గురువారం క్యాన్సర్ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఐఎంఏ నిడదవోలు శాఖ అధ్యక్షుడు డాక్టర్ నెక్కంటి శ్రీనివాసరావు ర్యాలీని ప్రారంభించారు. స్థానిక గణేష్ చౌక్ సెంటర్ నుంచి గణపతి సెంటర్ వరకు ర్యాలీ కొనసాగింది. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బళ్ళా శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి పి.దేవానందం, జిల్లా కోశాధికారి పి.చిన్ని, నిడదవోలు మండల శాఖ అధ్యక్షుడు పీఎస్వీ ప్రసాద్, కార్యదర్శి పీవీవీ సత్యనారాయణ, ఎస్‌కే ఖాసిమ్, సీహెచ్ సత్యనారాయణమూర్తి, బీఎస్ శివ, ఎస్.నారాయణ, బి.గోవిందరావు, కేడీఎస్వీ తేజ, నాగేంద్ర, మస్తాన్ వలి, నారాయణ జూనియర్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం

కొవ్వూరు: పట్టణంలో మసీదు వీధికి చెందిన వ్యక్తి పంపన రాజ్‌కుమార్ గత నెల 29వ తేదీ నుంచి కనిపించడం లేదని అతని భార్య పంపన అశ్విని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు పట్టణ ఎస్సై కె.జగన్‌మోహనరావు తెలిపారు. రాజ్‌కుమార్ 29న ఇంటి నుంచి ఉదయం ఎనిమిది గంటలకు పని నిమిత్తం బయటకు వెళ్లి మళ్లీ తిరిగి రాలేదు. పలుచోట్ల వెతికినప్పటికీ ఆచూకీ లభ్యం కాకపోవడంతో ఫిర్యాదు చేసినట్టు ఆయన తెలిపారు.